క్లుప్తంగా

దేవీతత్త్వంపై ప్రవచనం



ప్రవచనం వినిపిస్తున్న ప్రవాచకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎం మహంతయ్య వారిచే దేవీతత్త్వంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.

సైబర్ నేరాలపై గ్రామసభ


ప్రజలతో మాట్లాడుతున్న సీఐ రాము

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామంలో ఆదివారం రాత్రి సీఐ రాము గ్రామ సభ నిర్వహించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా 112 నంబర్‌లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

జూపాడుబంగ్లా: ప్రభుత్వం భవననిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తర్తూరు గ్రామంలో భవననిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంతకాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీతో పాటు అనేక కార్మిక సంఘాలు పోరాటాలు చేసి భవననిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును సాధించుకున్నట్లు చెప్పారు. బోర్డును పునరుద్ధరించటంతో పాటు నిధులు కేటాయించి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు లాలూబాషా, మౌలాలి, వహాబ్, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని జీఆర్ఎస్ సెంటర్

జూపాడుబంగ్లా: (జీఆర్ఎస్)జెండర్ రీసర్చ్ సెంటర్ ప్రారంభానికి నోచుకోవడంలేదు. మహిళల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం జీఆర్ఎస్ సెంటర్ ఏర్పాటు నిమిత్తం రూ.5లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరై నెలరోజులు గడిచినా ఇప్పటిదాకా కార్యాలయం ప్రారంభించకపోవటం గమనార్హం. కార్యాలయం ప్రారంభించకపోవటం వల్ల గృహహింస, అదనపుకట్నం, అఘాయిత్యాలకు, అత్యాచారాలకు గురైన మహిళలు వారి సమస్యలను మహిళా పోలీసులు(జీఎంఎస్‌కే), సీఆర్పీలకు తెలియజేసుకునేందుకు సరైన కార్యాలయం, వసతుల్లేకపోవటంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని త్వరగా జెండర్ రీసర్చ్ సెంటర్‌ను ప్రారంభించాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

పారదర్శకతే సమాచార హక్కు చట్టం ఉద్దేశం

నంద్యాల(అర్బన్): పాలనలో పారదర్శకత, అధికారుల్లో జవాబు దారి తనం పెరగాలన్నదే సమాచార హక్కు చట్టం ఉద్దేశమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమల్ల రహీం అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం సమాచార హక్కు చట్టం 20వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాల పట్ల ప్రజలు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాచార హక్కు చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టం కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మస్తాన్‌వలి, కార్యదర్శి సత్యనారాయణ, రహమతుల్లా, శివరామిరెడ్డి, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల్లా గోదాములు

ధాన్యం నిల్వ చేసుకునేందుకు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన గోదాములు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ప్రారంభించి ఏడాదిన్నరైనా రైతుల ముంగిటకు తీసుకెళ్లలేని కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా కనిపిస్తున్నాయి. అధిక వర్షాల సమయంలో అన్నదాతల దిగుబడులు తడవకుండా దాచుకోలేక పోయామని బాధపడుతున్నాయి. ఈ దుస్థితికి కారణమైన ప్రజాప్రతినిధుల చేతకాని తనాన్ని ఎత్తిచూపుతున్నాయి.

- ప్రారంభించి ఏడాదిన్నరైనా నిరుపయోగం
- ఇబ్బందులు పడుతున్న రైతులు


ఉపయోగంలో లేని ఎర్రమఠం మల్టీపర్పస్ గోడౌన్

కొత్తపల్లి: గత వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన గోదాములు రైతులకు ఉపయోగంలోకి తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. రైతులు పండించిన దిగుబడులకు ధర లేకపోయినప్పుడు, వర్షాల సమయంలోనూ నిల్వ ఉంచుకునేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో రూ.4.65 కోట్ల నాబార్డు నిధులతో నాగంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో గోదాముల నిర్మాణాలు చేపట్టింది. అందులో భాగంగా కొత్తపల్లి మండల పరిధిలో 12 గ్రామ పంచాయతీలకు గాను 9 గ్రామ పంచాయతీలలో గోదాములను మంజూరు చేసింది. ఇందులో 1,000 మెట్రిక్‌టన్నుల సామర్థ్యం గోదాములను రూ.75 లక్షల చొప్పున నిధులతో గువ్వలకుంట్ల, దుద్యాల, గోకవరం గ్రామపంచాయతీలలో నిర్మించారు. 500 మెట్రిక్‌టన్నుల సామర్థ్యం గోదాములను రూ.40 లక్షల చొప్పున ఖర్చు చేసి కొత్తపల్లి, కొక్కెరంచ, ఎదురుపాడు, గుమ్మడాపురం, శివపురం, ఎర్రమఠం గ్రామపంచాయతీలలో నిర్మించారు. అప్పటి నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో అప్పటి శాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి గోదాములను ప్రారంభించారు.

కూటమి ప్రభుత్వం రాకతో..

ప్రారంభించిన కొంత కాలానికే 2024 సార్వత్రిక ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో గోదాములు నిరుపయోగంగా మారాయి. ఖరీఫ్ సీజన్‌లో పండించిన దిగుబడులను ఎక్కడ నిల్వ చేసుకోవాలో తెలియక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధిక వర్షాలకు తడిసిపోవడంతో ధరపై తీవ్ర ప్రభావం చూపింది. రైతులు తమ ఇళ్లలో నిల్వ చేసుకునే అవకాశం లేక వ్యాపారులు అడిగిన ధరకే దిగుబడులు ఇచ్చేయాల్సి వచ్చింది.

వినియోగంలోకి తీసుకురావాలి



ధరలు లేనప్పుడు ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాములు ఎంతో ఉపయోగపడతాయి. ప్రభుత్వం స్పందించి గోదాముల సేవలను రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలి. వర్షాలు ఇప్పటికీ పడుతూనే ఉన్నాయి. వర్షం వచ్చిన ప్రతిసారి ధాన్యం ఎక్కడ భద్ర పరుచుకోవాలో అర్థం కావడంలేదు. ధాన్యం తడిపోతుందని భయం వేస్తుంది.– **మునిరంగ, రైతు, బట్టువారిపల్లె**

వరి నిల్వ చేసుకునేందుకు స్థలం లేదు



వరి సాగు చేశాను. ఇప్పుడు పంటలు కంకి విడిచే దశలో ఉన్నాయి. డిసెంబర్ మొదటి వారంలో కోతలు ప్రారంభమవుతాయి. ధర ఉంటే అమ్ముకుంటాను. గిట్టుబాటు ధర లేకపోతే నిల్వ చేసుకునేందుకు మా ఇల్లు చిన్నగా ఉంది. అంతలోపైనా గోదాములు వినియోగంలో తెస్తే బాగుంటుంది.

– ప్రేమ్‌కుమార్, రైతు, గువ్వలకుంట్ల

పేదలకు అండగా ఉంటాం

మహానంది: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు జనసేన సహాయ సహకారాలు అందిస్తుందని జనసేన జిల్లా నాయకులు భవనాశి వాసు, సుధాకర్ అన్నారు. మహానంది మండల జనసైనికుల ఆధ్వర్యంలో మహానంది సమీపంలోని చెంచులక్ష్మి గిరిజన గూడెంలో సుమారు రూ.40 వేలు వెచ్చించి ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకును ఆదివారం వారు ప్రారంభించారు.

అడ్వకేట్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

నందికొట్కూరు: సుప్రీం కోర్టు న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన అడ్వకేట్ రాకేష్ కిశోర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మాలమహానాడు నాయకులు వెంకటేశ్వర్లు, మధు డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడ్వకేట్ సభ్యత్వం రద్దుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడి మరవకముందే హర్యాణ రాష్ట్రంలో దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ మరణం బాధాకరమన్నారు. కుల వివక్ష వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు శ్రీను, నాగేంద్ర, ధర్మరాజు, భక్షాలు, రవి, ఏసురత్నం, ప్రకాష్‌రావు, విజయరాజు, నత్తానాయేలు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు

ఆత్మకూరు: వ్యవసాయ కార్మికుల వేతనాలను పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సుదర్శన భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఎం.నాగేశ్వరరావు మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు ఐదు సెంట్ల స్థలమిచ్చి రూ.5 లక్షలతో పక్కా గృహాలు నిర్మించాలన్నారు. ప్రజా పంపిణీ ద్వారా కేరళ రాష్ట్రంలో తరహా 15 రకాల నిత్యావసర సరుకులను అందించాలని కోరారు. ఉపాధి హామీ చట్టం ద్వారా కుటుంబానికి 200 రోజులు పనులు కల్పించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాలయ్య, డేవిడ్, జిల్లా సహాయ కార్యదర్శి ఫకీర్ సాహెబ్, జిల్లా నాయకులు టీట బ్లెస్, ఎం.కర్ణ, ఎస్.ఆర్.రమణ, సుబ్బరాయుడు, రత్నమయ్య, కులాయిస్వామి, సంజీవ పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న పీడీఎస్‌యూ నాయకులు

నందికొట్కూరు: సంక్షేమ హాస్టళ్ల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను ఉధృత్తం చేస్తామని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మద్రిస్వామి తెలిపారు. ఆదివారం ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా, ఉపాధి కల్పన కోసం పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. సంక్షేమ హాస్టళ్లను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్కు, కమాటీ, వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్ బిల్లులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శివతేజ, ఖలీల్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యానేరం


పొదుపు మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఆర్పీలు

జూపాడుబంగ్లా: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని డీఆర్‌డీఏ జెండర్ సోషల్ యాక్షన్ కమిటీ సీఆర్పీలు నౌషద్, శిరీష తెలిపారు. ఆదివారం పారుమంచాల గ్రామంలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఆర్పీలు మాట్లాడుతూ పురుషులు మహిళలను అదనపుకట్నం కోసం వేధించటం, గృహహింస, అఘాయిత్యాలకు పాల్పడటం చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులు అబ్బాయిలతో సమానంగా ఆడపిల్లలను చదివించటంతో పాటు విద్యా, ఉద్యోగరంగాల్లో రాణించేలా చేయాలన్నారు. సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలను కుటుంబ సభ్యులకు తెలియజేయటంతో పాటు పోలీసులను ఆశ్రయించి న్యాయం కోసం పోరాడాలని సూచించారు. లింగవివక్షత పాటించబోమని పొదుపు మహిళలతో సీఆర్పీలు ప్రతిజ్ఞ చేయించారు.

బాబూ.. ప్రత్యేక హోదాపై ప్రశ్నించవెందుకు?


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్‌బాబు

జూపాడుబంగ్లా: ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్రాభివృద్ధికి నిధుల కేటాయింపుపై కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని సీఎం చంద్రబాబునాయుడును సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్‌బాబు ప్రశ్నించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, నిధుల కేటాయింపుపై ఒకలా మాట్లాడి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వంలో భాగమైన బీజేపీపై పల్లెత్తు మాట కూడా అనడం లేదన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం నోరుమెదపటం లేదన్నారు. రాష్ట్రాభివృద్ధిని ఏమాత్రం సాయం చేయని పీఎం నరేంద్రమోదీ రాష్ట్రంలో పర్యటించటం సమంజసం కాదన్నారు. అందుకే పీఎం పర్యటనను అడ్డుకుంటామన్నారు.

స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయండి

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచన


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


సమావేశానికి హాజరైన పార్టీ కార్యకర్తలు

ఆత్మకూరు: రాబోయే స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో జరిగే అన్ని కార్యక్రమాల్లో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. పనితీరును బట్టి ప్రాధాన్యత, పదవులు దక్కుతాయన్నారు. అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

కోటి సంతకాలను వేగవంతంగా పూర్తి చేయాలి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తున్నామని, ప్రజా ఉద్యమంలో భాగంగా రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు కోటి సంతకాల సేకరణ పూర్తి చేయాలని శిల్పా చక్రపాణిరెడ్డి సూచించారు. ఇప్పటి వరకు శ్రీశైలం నియోజకవర్గం అన్ని కార్యక్రమాల్లో ముందు ఉందన్నారు.

ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటుందని శిల్పా అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సైతం వచ్చే ఎమ్మెల్యే ఎన్నికల్లో తనకు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టడం ఖాయమన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను తూతూమంత్రంగా అందించడంతోపాటు విద్య, వైద్య రంగాలను పూర్తిగా విస్మరించడంతో అన్ని వర్గాల్లో వ్యతిరేకత ఏర్పడిందన్నారు.

శిల్పాకు సన్మానం

మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రజాక్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ తనకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనపై నమ్మకంతో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బాధ్యతలు కట్టబెట్టారన్నారు. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, నాయకులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, విజయ్‌చౌదరి, లాలు, మున్నీర్ బాషా, బాలస్వామి యాదవ్, వెంకటస్వామిగౌడ్, పుల్లయ్య యాదవ్, రమేష్, స్వామి, పార్వతి, దర్గమ్మ, షఫీవున్, మరియమ్మ, అంజాద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా

నకిలీ మద్యం సరఫరా, బెల్ట్ షాపులను రద్దు చేయాలనే డిమాండ్‌తో సోమవారం ఆత్మకూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని శిల్పా చక్రపాణిరెడ్డి కోరారు. కూటమి ప్రభుత్వం గుడి, బడి తేడా లేకుండా విచ్చలవిడిగా బెల్ట్‌షాపులను ఏర్పాటు చేసిందన్నారు.

నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొనాలని ఆయన కోరారు.

సింగరాజు పల్లెకు బస్సు సౌకర్యం

కొత్తపల్లి: మండలంలోని సింగరాజు పల్లి గ్రామానికి ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామానికి వచ్చిన ఆర్టీసీ బస్సుకు మామిడి తోరణాలు, పూలమాలలు వేసి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం హారతులిచ్చి హర్షం వ్యక్తం చేశారు. గతంలో బస్సు సౌకర్యం లేకపోవడంతో అర కిలోమీటర్ నడిచి బస్టాండ్ వద్ద బస్సుల కోసం వేచి ఉండేవాళ్లమని గ్రామస్తులు ప్రసాద్, ఆంజనేయులు, కృష్ణయ్య, సంజీవరెడ్డి, రాము, వెంకటేశ్వర్లు అన్నారు. ప్రస్తుతం బస్సు గ్రామంలోకి రావడంతో ఆత్మకూరు వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. బస్సును సింగరాజు పల్లి గ్రామంలోకి వేసినందుకు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

బహుళజాతి కంపెనీలకు దోచిపెడుతున్న మోదీ

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ఆత్మకూరు: డిజిటల్ అగ్రి మిషన్ పేరుతో ప్రభుత్వ భూములను, పేదల భూములను ప్రధాని మోదీ బహుళజాతి కంపెనీలకు దోచిపెడుతున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి కేంద్రప్రభుత్వాన్ని ఆరోపించారు. ఆదివారం ఎంఎంకే ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలో కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. 2014లో బీజేపీ ఇచ్చిన వాగ్దానాలు ఆకర్షించాయని, అధికారంలోకి వచ్చాక వాటిని చేయడంలో ప్రధాని నరేంద్రమోదీ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఒక మాట.. ఎన్నికల తర్వాత మరో మాట చెప్పి రైతులను నట్టేట ముంచిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం విధానాల వల్ల గంటకు ఒక రైతు చొప్పున ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. దాదాపు రూ.4500 కోట్ల ఆస్తులను రూ.450 కోట్లకే అంబానీ కుటుంబాలకు కట్టబెట్టేందుకు మోదీ యత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ నాగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్, సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌వీ కృష్ణారెడ్డి, రామపక్కీర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో కరువు భత్యం చెల్లిస్తున్నా కూటమి సర్కారు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన కరువు భత్యం 15 నెలలు దాటినా ఇవ్వడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక రీతి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను మరో రీతిలో చూసే డబుల్ ఇంజన్ సర్కార్ ధోరణి మారాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక పర అంశాలన్నింటినీ మెడికల్ బిల్స్, సరెండర్ లీవ్, గ్రాట్యుటీ తర్వగా చెల్లించాలని, లేనిపక్షంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శులు ధనుంజయ, చాంద్‌బాషా, భాస్కర రెడ్డి, నాయకులు రవిప్రకాష్, సుమన్, మాధవరెడ్డి, కేవీ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం



ఆత్మకూరులోని ఎం డబ్ల్యూ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు ఎస్ఎస్ సయ్యద్‌మీర్ కుమారుడి వివాహ వేడుకల్లో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

– ఆత్మకూరు

వైద్యం.. అందని ద్రాక్ష!

- గత వైఎస్సార్‌సీపీ హయాంలో జగనన్న సురక్షతో ఇంటి ముంగిటకే వైద్య సేవలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక అటకెక్కిన వైనం
- పట్టణ, గ్రామాల్లో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు



వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్

నందికొట్కూరు: పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. ప్రతి నెలా గ్రామాల్లో నిపుణులైన వైద్యులతో జగనన్న సురక్ష పేరుతో వైద్య శిబిరాలు నిర్వహించి ఇంటి వద్దకే వైద్య సేవలు అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు వైద్య సేవలు అందించే విధానానికి మంగళం పాడారు. అధిక వర్షాలకు తాగు నీరు కలుషితమై, దోమలు విజృంభించి పల్లె ప్రజలు వ్యాధుల బారిన పడి మంచం పట్టినా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టనట్టు ఉన్నారు. ఫలితంగా పేదలకు వైద్యం దైవాధీనమైంది.

నందికొట్కూరు నియోజకవర్గంలో సామాజిక ఆరోగ్య కేంద్రం-1, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు -11 ఉన్నాయి. పీహెచ్‌సీలలో రోజుకు 100 నుంచి 120 మంది రోగులు వైద్య పరీక్షల కోసం వస్తూ ఉంటారు. నందికొట్కూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజు 350 నుంచి 400 వరకు ఓపీ నమోదవుతోంది.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యాన్ని గాలికొదిలేసింది. ఇప్పుడు గ్రామాల్లో ఎక్కడా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగించాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా వైద్యానికి పెద్దపీట వేసింది. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మందులు అందించేది. ఈ శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు అలాంటి వైద్య శిబిరాలు లేవు. సీజనల్ వ్యాధులు సోకినప్పుడు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నాణ్యమైన వైద్యం అందుబాటులో లేక స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఇంటి వద్దకే వైద్యం, ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగించాలి.

– సుంకన్న బొల్లవరం గ్రామం, నందికొట్కూరు మండలం